39

# వ్యక్తి గుణవంతుడైనప్పుడే సమాజము గుణవంతమైన సమాజముగా రూపొందుతుంది

**మంచివారి చెలిమి మహిలోన దొరుకదు**
**దుష్టులెందరైన దొరుకుచుంద్రు**
**కలికి రాయి భువిని కలదు యెందైనను**
**వెలను బోలు వజ్రమె వెతుకవలయు.**

సంస్కారములందును, సంకల్పములందును ప్రజలు అనేక విధములుగా ఉండుట మనకు ప్రత్యక్ష సత్యము. దేశమనగా మానవసమూహము. ఆ సత్యము యీ దేశమునకుకూడను అన్వయిస్తుంది. భౌగోళిక పరిస్థితులయొక్క ప్రభావము, వాతావరణముయొక్క పరిస్థితి సమముగా ఉండినప్పటికి, జీవరాసులయొక్క తత్వము వేరు వేరుగా ఉండటము ప్రకృతిలో సహజము. ఈ భేదములు దూషణము కానేరవు. ఐతే, యీ విధమైన మార్పులు పశుపక్షి మృగాదులందు మనకు కానరావు. కారణము, పశుపక్షి మృగాదులందు ఆలోచనా శక్తి లేకపోవటమే! ఆలోచనా శక్తి కలిగిన మానవునియొక్క మనస్సు అనేక విధములుగా చలిస్తూ ఉంటుంది. ఎన్ని చదువులు చదివినా, ఎన్ని పదవులనేలినా, ఎంత తెలివితేటలు కలిగినప్పటికిని మానవుడు కోరేది రెండు-తాను గొప్పవాడు కావాలని, మంచివాడుగా ఉండాలని ఆశిస్తూ ఉంటాడు. ఎవరూకూడను తాను అల్పుడుగా జీవించాలని ఆశించడు. చెడ్డవాడుగా జీవించాలని కోరుకోడు. అయితే గొప్పవానికిని మంచివానికిని ఉండిన వ్యత్యాసము యేమిటి? గొప్పవాడనేవాడు ఒక్క భౌతికమైన జీవితమును మాత్రమే ఆధారముగా తీసుకుంటాడు. మంచివాడు తన మంచి గుణములను పోషించుకోవటానికి తగిన కృషి సలుపుతాడు. సంరక్షించుకోటానికి తగిన ప్రయత్నము చేస్తాడు.

**మంచివానికి, గొప్పవానికి గల వ్యత్యాసమును గుర్తించి నడుచుకోవాలి**

sri sathyasai vachanamrutam

కనుక మంచివానికి, గొప్పవానికి ఉండిన వ్యత్యాసమును మనము మొదట గుర్తించాలి. గొప్పవాడు కొన్ని విధములైన భోగభాగ్యములు అనుభవిస్తాడు. మంచివాడు దివ్యానందమును అనుభవిస్తాడు. గొప్పవాని తత్వము రజోగుణముతో కూడిఉంటుంది. మంచివాని గుణము శుద్ధసత్త్వముతో రూపొందుతుంది. కనుక, సాత్త్వికమైన తత్వాన్ని అభివృద్ధి పరచుకోటమే మంచివారియొక్క లక్షణము. రాగద్వేషములచేత కూడి అహంకార, ఆడంబరములచేత జీవించే మానవత్వము కేవలము గొప్పవారుగా రూపొందుతుంది. దీనికి భిన్నముగా సత్యతత్త్వముతో, ఆనందముతో జీవితాన్ని అనుభవించటానికి ప్రయత్నిస్తాడు, మంచివాడు. ఈ మంచితత్వమునకే ధర్మము తోడ్పడుతూ ఉంటుంది. ధర్మము అనేది ఒక అద్దము వంటిది. ఇది మన కర్తవ్యమును మనకు గుర్తుచేస్తుంది. మన నడతను ధర్మమనే అద్దమునందు ప్రతిబింబచేస్తుంది. మనము తల్లితండ్రులను కష్టపెట్టే జీవులుగా మారినప్పుడు, మనబిడ్డలవలన మనము కష్టమును అందుకునే జీవులుగా రూపొందుతాము. కన్న తల్లితండ్రులను ఆనందపరిచే ప్రయత్నములో పూనుకున్నప్పుడే మనము కన్న బిడ్డలు మనకు ఆనందమును అందించటానికి సంసిద్ధులై ఉంటారు. మనము మిత్రులను మోసగించటానికి ప్రయత్నించినప్పుడు, యేదో ఒకనాడు మనము మిత్రులచేత మోసపోతాము. 'యద్భావం తద్భవతి' అనే సత్యాన్ని ధర్మము మనకు నేర్పుతూ వస్తున్నది. ప్రస్తుతము యీ విచారణ చేయక కేవలము ఏదో మనకు తోచినట్లు ఆచరించటమే గాని ముమ్ముందు దీనియొక్క ఫలితము అనుభవించటము తప్పదనే సత్యాన్ని మనము గుర్తించుకోవాలి.

**భగవంతుని అనుగ్రహము ఒక్కటి కోరుకుంటే, దానివలన సర్వము మనకు లభిస్తాయి**

మనకు కొన్నిరకములైన ఆలయములుంటున్నవి. ఒకటి విద్యాలయము, రెండవది భోజనాలయము, మూడవది వైద్యాలయము, నాల్గవది దేవాలయము. ఈ నాల్గు మానవునికి ఆలయములతో సమానమే! అయితే, ఈనాడు మనప్రకృతి యొక్కస్వభావముచేత, మానత్వమనేది నైతికతను కోల్పోటంచేత మన ప్రవర్తనలో మార్పులు వస్తున్నవి. మనము ఒక భోజనాలయమునకు వెడతాము. మనకు కావలసిన పదార్థములకు మాత్రమే ఆర్డరు యిచ్చి దానిని భుజించి ఆనందముగా బయటకు వస్తాము. అలాగే వైద్యాలయమునకు వెడతాము. మనకు ప్రాప్తించిన రోగముయొక్క లక్షణాలను డాక్టరుకు విన్నవిస్తాము. డాక్టరు పరీక్షించి

తగిన ఔషధము నందిస్తాడు. అప్పుడే నీవు వైద్యాలయమునకు వెళ్లిన పని పూర్తి అవుతుంది. అట్లుకాకుండా వైద్యాలయమునకు వెళ్లి మసాలా దోశ, పెరుగువడ కోరితే అక్కడ మనకందిస్తారా? వైద్యాలయమునకు వెళ్ళినప్పుడు రోగమునకు సంబంధించిన విషయములు మాత్రమే మనము చర్చించుకోవాలి. భోజనాలయమునకు వెళ్లినప్పుడు మనము ఆశించిన పదార్థములను మాత్రమే ఆర్డరు యివ్వాలి, ఆరగించాలి. ఇక విద్యాలయమునకు వెళ్లినపుడు మన subject ను గురించి మన టీచర్సు, మన ప్రొఫెసర్సు బోధించే బోధనల విషయం మనము చర్చించుకోవాలి, విచారించుకోవాలి. ఇది సక్రమమైన మార్గము. ఇక దేవాలయము. ఈ దేవాలయమునందే జనులు మార్గము తప్పి నడుస్తున్నారు. వైద్యాలయమునకు వెడితే వైద్యమునకు సంబంధించినవి మాత్రమే మనము కోరుతున్నాము. భోజనాలయమునకు వెడితే భోజనమునకు సంబంధించిన విషయాన్ని గురించే చూచుకుంటున్నాము. విద్యాలయమునకు వెడితే విద్యకు సంబంధించిన విషయాన్నే మనము చర్చించుకుంటున్నాము. కానీ, దేవాలయమునకు వచ్చినప్పుడు దేవునికి సంబంధించిన విషయము కాకుండా అన్య విషయములు మనము చర్చించరాదు. ఇక్కడనే మనము దారితప్పి నడుస్తున్నాము. అనవసరమైన విషయాలనంతా ఆశిస్తున్నారు. అనిత్యము, అసత్యము, అశాశ్వతమైన విషయాలనంతా కోరుతున్నారు. ఒక్క భగవంతుని అనుగ్రహ, ప్రేమలకు పాత్రులైతే అన్ని కార్యములు మనకు చక్కగా నెరవేరతాయనే విశ్వాసము కోల్పోతున్నాము. దేవుని ప్రేమానుగ్రహములు కోరవలసినది పోయి యితరములు కోరటానికి ప్రయత్నిస్తున్నాము. దైవప్రేమానుగ్రహములు మనము పొందినప్పుడు సర్వము మనకు లభిస్తుంది. ఇక్కడకు వచ్చి అనేక విధములైన భేదభావములు, తర్కములు, కొన్ని doubts, కొన్ని రకములైన వాదోపవాదములు జరుపుకుంటూ ఉంటున్నాము. సంబంధములేని యితరులతో సంబంధము కల్పించుకొని అనవసర విషయములలో కాలమును వ్యర్థము చేస్తున్నాము.

విద్య, ధనము మరియు బలము వాటిని అనుభవించే వ్యక్తియొక్క స్వభావమునుబట్టి మంచి లేక చెడుగా మారుతుంటాయి. కాలమే ప్రమాణము, ప్రధానమనే సత్యాన్ని మనము ఈనాడు విస్మరిస్తున్నాము. మనకు లభించినకాలమును సద్వినియోగపరచుకోటానికి ప్రయత్నించటంలేదు. చదువు మనకు అవసరమే, ధనము మనకు అవసరమే, బలముకూడ

sri sathyasai vachanamrutam

అత్యవసరమే! అయితే యీ చదువు, ధనము, బలములను మనము వినియోగపరచుకొనే విధానమును బట్టి మనకు విచారము, ఆనందము లభిస్తూ ఉంటాయి. సద్గుణవంతునిదగ్గర విద్య చేరినప్పుడు, యిది విజ్ఞానమును గుర్తింపచేసి తనయొక్క జీవితము ఆదర్శవంతమైన జీవితముగా రూపొందింపచేసుకుంటాడు. దుర్మార్గునిదగ్గర యీ విద్య ప్రవేశించినప్పుడు వాదోపవాదములలో మునిగి విద్య విశిష్టతను కోల్పోతుంది. గుణవంతునిదగ్గర ఈ ధనము చేరిన దానము, ధర్మము, త్యాగములద్వారా అతడు తన జన్మ సార్థకము గావించుకొనే పవిత్రమార్గములో ప్రవేశిస్తాడు. దుష్టగుణములు కలిగినవానిదగ్గర ధనము చేరినప్పుడు వాడు అహంకారముతో విఱ్ఱవీగి కట్టకడపటికి అధఃపతనమైపోతుంటాడు. అదేవిధంగా గుణవంతుని దగ్గర బలము చేరినప్పుడు దానిని పరోపకారములో ప్రవేశపెట్టి సమాజములో సహజీవనాన్ని సలుపుతూ ఉంటాడు. సంఘసేవలో పాల్గొని, సమాజసేవయొక్క తత్వాన్ని గుర్తించి వర్తించటానికి ప్రయత్నిస్తాడు. దుష్టునికి దేహబలముకూడా తోడయినప్పుడు దానిని దుర్వినియోగపరచి బలహీనునిపైన తన బలము ప్రవేశపెట్టి వానిని హింసించటానికి పూనుకుంటాడు. ఏతావాతా విద్య, ధనము, బలము ఈ మూడుకూడా మంచివి, చెడ్డవని విమర్శించటానికి వీలులేదు. వీటిని అనుభవించే వ్యక్తియొక్క గుణములను పురస్కరించుకొని యివి మంచిగాను, చెడ్డగాను మారిపోతుంటాయి.

**మనిషి మంచివాడైనప్పుడు దేశము బాగుపడుతుంది**

దీనిని పురస్కరించుకొనియే "మనయేవ మనుష్యాణాం కారణం బంధమోక్షయోః" అని ఒక సూక్తి బయలుదేరింది. మన మనస్తత్వాన్ని కొంతవరకు మనం మార్చుకోటానికి ప్రయత్నించాలి. భౌతికమైన రాజకీయ, ఆర్థిక, వైజ్ఞానిక, పరిణామములు కొంతవరకు అవసరమే! కానీ, దురదృష్టవశాత్తు ఈనాడు రాజకీయ పరిణామము, ఆర్థిక పరిణామము, సాంఘిక పరిణామము మరియు వైజ్ఞానిక పరిణామములు విరివిగా పెరుగుతూ వస్తున్నవిగాని, మానసిక పరిణామము, ఆధ్యాత్మిక పరిణామము అడుగంటిపోతున్నవి. మానవ నిర్మాణమే విశ్వనిర్మాణమని మరచిపోతున్నాడు. మనిషి మంచివాడైనప్పుడు దేశము బాగుపడుతుందనే సత్యాన్ని కూడను మరచిపోతున్నారు. 'వ్యక్తి గుణవంతుడైనప్పుడే సమాజముకూడను



sri sathyasai vahinamrutam

గుణవంతమైన సమాజముగా రూపొందుతుంది,' అనే సత్యాన్ని తెలుసుకోలేకపోతున్నారు. కనుక, మానవత్వాన్ని దివ్యత్వముగా మార్చుకొనే పవిత్రమైన భావములను మనలో ప్రవేశింపచేసుకోవాలి. ఎప్పుడూ యితరులయొక్క చెడ్డను, యితరులయొక్క దోషములను యితరులయొక్క అపకారమును మనము దృష్టియందు ఉంచుకొని వారిని దూషించటానికి ప్రయత్నిస్తున్నామే గాని మనదోషములు యేమిటి, మన అపకారములు యేమిటి, మనలో ఉన్న చెడ్డయేమిటి అని వెతుక్కోటానికి యే మానవుడు ప్రయత్నించటం లేదు. పరులలోని నూరు తప్పులను మనము విచారించే బదులు, మనయందున్న ఒక్కతప్పును గుర్తించుకుంటే ఎంతో పవిత్రులమవుతాము. సుగంధ పుష్పములతో, మధురమైన ఫలములతో కూడిన ఉద్యానవనమునందు ప్రవేశించి కూడను పంది మలమునే వెతకటానికి ప్రయత్నిస్తుంది. ఫల పుష్పముల సుగంధ, మాధుర్యములను అనుభవించటానికి యేమాత్రము పూనుకోదు. అదే విధముగనే విశిష్టగుణములుండిన మానవుడు, ఎలాంటి పవిత్ర హృదయులందుకూడను దోషములు వెతకటానికే పూనుకుంటాడు. వారియందున్న పవిత్రమైన భావములను అందుకోటానికి తాను యేమాత్రము పూనుకోడు. మానవత్వములోని యీవిధమైన దోషాలు నిర్మూలముగావించుకున్నప్పుడే మనము నిజమైన మానవులుగా రూపొందుతాము. మానవుడు మానవునిగా జీవించాలంటే, మనిషి మనిషిగా మనవలెనంటె అనేక బాధలకు, కష్టములకు, నిష్ఠూరములకు, దుఃఖములకుకూడ సహించుకోవాలి.

**అహంకార, అసూయలు మనలో ప్రవేశించకుండా చూచుకోవాలి**

వీటినన్నింటిని తట్టుకొని, నెట్టుకొని ముందుకు సాగినప్పుడే మానవ జీవితము ధన్యవంతమవుతుంది. కష్టములు, బాధలు, నిందలు, నిష్ఠూరములు లేకుండా మానవుడు ఆదర్శమును నిరూపించటానికి యేమాత్రము వీలుకాదు. మంచికి, చెడ్డలు ఒక నీడవలె ఉంటాయి. మంచి సుగంధము నందించే గులాబి పుష్పము క్రిందనే ముండ్లు చేరి ఉంటాయి. అదేవిధముగ మంచికి, చెడ్డ జంటగా ఉంటుంది. వెంటనే వస్తూ ఉంటుంది. మనము దీనిని లెక్కచేయకుండా మనయొక్క ఆదర్శమును, ఆశయములను నెరవేర్చుకునే నిమిత్తమై సద్భావములతో జీవితాన్ని సాగించుకుంటూ పోవాలి. ఇలాంటి పవిత్రమైన జీవితమును

sri sathyasai vahini amrutam

సాధించాలనుకుంటే మొట్టమొదట దైవ విశ్వాసము కుదరాలి. ఈ విశ్వాసము లేని మానవుడు ఎన్ని కార్యక్రమములు చేసినప్పటికి అవి ఉపకారములు అనిపించుకోవు. తాను మంచివాడు కానేరడు. ప్రపంచమనేది మహాద్భుతమైన ఒక కళా ఖండము. దీనిని మనము ఏవిధముగా అనుభవిస్తున్నాము? ఈ కళయొక్క జన్మస్థానము ఏమిటి, ఎక్కడ నుండి వచ్చింది అనే సత్యాన్ని మనము గుర్తించాలి. యీ art అంతా heart నుంచి వచ్చిందనే సత్యమును ఆధ్యాత్మికము ప్రబోధిస్తుంది. ఆత్మతత్త్వమే యీ కళలయొక్క ప్రభావమని కూడను బోధిస్తుంది. కనుకనే వేదాంతము Reflection of Inner being అని చెబుతుంది. అనగా, మంచివాని భావము మంచినే నిరూపిస్తుంది. చెడ్డవానియొక్క భావము చెడ్డగానే రూపొందుతుంది. యీ రెండింటికి మనో ప్రభావమే తప్ప ఏ విధమైన పదార్థముయొక్క దోషము కారణము కాదు. యీ వయస్సులోపల విద్యార్థులు అనేక దుష్ప్రభావములకు లోనవుతుంటారు. ఈ వయస్సు, అహంకార, అసూయాదులకు చాలా అనుకూలమైన వయస్సు. కనుక, యిలాంటి సమయమందు యీ యిరువురు శత్రువులు మనలో ప్రవేశించకుండా ఉండటానికి తగినకృషి చెయ్యాలి.

**ముక్తి అనగా వాంఛలను క్రమేణా తగ్గించుకోవటమే!**

శరీరమునకు రక్తము యెంత అవసరమో, ఆత్మానందమునకు భక్తి అంత అవసరము. ఈ భక్తియే నిజమైన మానవశక్తి. ఈశక్తియే ప్రపంచముపైన రక్తిగా రూపొందింపచేస్తున్నది. ఈ రక్తియే మానవునికి సర్వశక్తులు అందిస్తున్నాది. ఈ శక్తియొక్క అనుభూతివలనే విరక్తికూడను మనకు ప్రాప్తిస్తున్నాది. ఈ విరక్తి ప్రాప్తించినప్పుడే ముక్తి మనకు లభిస్తుంది. కనుక, భక్తిలేకుండిన రక్తి మనలో యేమాత్రము ప్రవేశించదు. ఆ రక్తియే లేకుండిన మనకొక శక్తియే ప్రాప్తించదు. ఈ శక్తియే లేకుండిన విరక్తియే మనకు రాదు. ఈ విరక్తి లేక ముక్తిరాదు. ముక్తి అనగా ఒక ప్రత్యేకమైన పదార్థముగాని, ప్రత్యేకమైన స్థానముగానీ కానేరదు. మనయొక్క వాంఛలను క్రమక్రమేణా తగ్గించుకోటమే! ఆ యొక్క కోరికలందు కామక్రోధ లోభములను సాధ్యమైనంతవరకు అదుపులో పెట్టటానికి ప్రయత్నించాలి. ఈ క్రోధము ఒక పెద్ద దయ్యము. ఈ క్రోధము మనలో ప్రవేశించిన, జ్ఞానము శూన్యమై పోతుంది. క్రోధము కలిగినవానికి విచారణాశక్తి యేమాత్రము ఉండదు. విచారణాశక్తిని కోల్పోటమే జ్ఞానశక్తిని కోల్పోటము. ఇంక కామము అనగా కోరికలు కలిగినవానికి భక్తి ప్రాప్తించదు. కోరికలు మితిమీరి మతిని చెడగొడతాయి. ఆ విధంగా మతి చెదిరినప్పుడు, నిజమైన ప్రేమ తత్త్వము ప్రాప్తించదు. ఇంక

sri sathyasai vahamrutam

లోభియైనవాడు త్యాగమునకు పూనుకోడు. త్యాగమనే పేరు వింటేనే భయపడతాడు. కనుక

**లోభివాని చంప లోకంబు లోపల**
**కొట్టవలదు వాని తిట్టవలదు**
**డబ్బు అడిగినంత డబ్బున తా జచ్చు**

లోభియందు త్యాగము లేకపోవడంచేత, అసలు కర్మనే ఆచరించడు. కామము, భక్తిని నాశనము చేస్తున్నది; క్రోధము జ్ఞానమును నాశనము చేస్తున్నది; లోభము ఏకంగా కర్మనే నాశనము చేస్తున్నది. ఈనాటి యువకులు సాధ్యమైనంతవరకు కామ, క్రోధ, లోభముల నడుమలో నుంచుకొని అవసరమైనంతవరకుమాత్రమే వాటిని ప్రవేశపెట్టాలి. యీ విధమైన పవిత్ర భావములతో జీవించడమే ప్రధానమైన విద్యగా భావించి, ప్రాకృతమైన విద్యలను అభ్యసించటానికి ప్రయత్నించాలి.

**ఆధ్యాత్మిక విద్యలేని విద్యాభ్యాసము కేవలము నిరుపయోగము**

మనకు అవసరమైన జ్ఞానములు ఐదు ఉంటున్నాయని అనేక పర్యాయములు చెప్పాను. ఈనాటి విద్య అంతా కేవలము bookish knowledge. ఈ Bookish knowledge యెంతకాలము ఉంటున్నాది? కొంతకాలము మాత్రమే దీని జీవిత పరిమితి. దీనిలో కొన్ని ప్రధానమైన అంశములు తీసుకొని superficial knowledge అంటున్నాము. ఈ superficial knowledge అనేదాన్ని మనము తిరిగి లౌకికమైన knowledge లోపల ప్రవేశపెడుతున్నాము. అదే general knowledge. ఈ general knowledge, discrimination knowledge ఉన్నప్పుడే useful అవుతుంది. Discrimination knowledge లేకపోతే general knowledge ప్రయోజనము లేదు. ఈ general knowledge అనేదానికి ముందు practical knowledge. ఈ practical knowledge ఉండినవాడే నిజమైన తెలివితేటలు కలిగినవాడని చెప్పవచ్చు. ఈ practical knowledge ఉండిన మానవులు ఈనాడు అరుదుగా ఉంటున్నారు. కాని bookish knowledge ఉండినవారు నూటికి తొంభైమంది ఉంటున్నారు. ఇంక superficial knowledge కలిగినవారు 80% ఉంటున్నారు. ఎంతమంది ఉన్నా General knowledge లో zero గానే ఉంటున్నారు. ఎందుకంటే commonsenseను వారు ఉపయోగ పెట్టటంలేదు. General

sri sathyasai vahinamrutam

knowledge, commonsense రెండు ఉన్నప్పుడే discrimination knowledge మనకు ప్రాప్తిస్తుంది. ఈనాడు common sense ఉంటే general knowledge లేదు. General knowledge ఉంటే common sense లేదు.

విద్యార్థులారా! ఈనాడు గ్రంథపరిచయమైన bookish knowledge లోపలనే వాదోపవాదములు అధికమైపోతున్నాయి. ఏమి question వెయ్యాలి ఏమి answer దీనికి correct గా ఉంటుందాది అనే విషయమే తెలియకుండా ఉంటున్నాది. కనుక యీ bookish knowledge లోపల సరియైన విద్య మనకు లభించటం లేదు. నీకు నిజమైన మానవత్వముతో కూడిన knowledge ప్రాప్తించాలంటే ఆధ్యాత్మిక మార్గమునందే ప్రవేశించాలి. ఆధ్యాత్మిక విద్యలేని విద్య కేవలము నిరుపయోగమైన విద్య. ప్రాపంచిక చదువులు కలిగిన మానవునికి ఆధ్యాత్మిక విద్య లేకపోతే 'తెలివి తేటలు కల దయ్యము' అని చెప్పారు. కనుక యీనాడు విద్యార్థులు ఈ విధమైన దయ్యాలుగా తయారౌతున్నారు గాని, దైవముగా రూపొందటానికి ప్రయత్నించటం లేదు. ఏ విషయాన్ని చూచినాగాని తర్కించటం, తర్కించటం. పవిత్రమైన ఆదర్శమార్గములో ప్రవేశించలేదు. ఇట్టివాడు సత్యమార్గములో ప్రవేశించటానికి అర్హుడు కాదు. జిజ్ఞాస కలిగిన మానవునికే ఈ సత్యతత్త్వము గుర్తించటానికి వీలవుతుంది.

**పుట్టినపుడు ఏడ్చినారు చచ్చునపుడు ఏడ్చుతారు**
**మధ్య మధ్య విషయాలకు ఎందుకెందుకో ఏడ్చుతారు**
**ధర్మగ్లాని సంభవింప ఉద్ధరింప యేడ్చినారా**
**ఎందుకోసమేడ్చినారు? ఏడ్పుకోసమేడ్చినార!**

కనుక, మనము దేనికోసం యేడుస్తున్నాం? మనము మనలను ఉద్ధరించుకోటానికై యేడ్చుటం లేదు; లేక, ధర్మాన్ని ఉద్ధరించటానికై ఏడ్చుటం లేదు. పరులు బాధపడుతుంటే వారిని సంరక్షించాలని యేడుస్తున్నారా అంటే, దానికీ ఏడ్చుటం లేదు. ఎందుకోసం ఏడుస్తున్నారో వారికే తెలియకుండా ఏడుస్తున్నారు. ఏడుపుకు కూడను ఒక కారణము ఉండాలి. కారణము లేని కార్యము జరగటానికి వీలులేదు. అదేవిధముగా ఈనాటి యువకులందరు అనవసరమైన విషయములనంతా తలకు చేర్చుకుంటున్నారే గాని నిత్యసత్యమైన అవసర విషయాన్ని తలకు

srisathyasaivachanamrutam

చేర్చుకోటానికి ఏమాత్రం ప్రయత్నించటం లేదు. కనుక, యిలాంటి భావములంతా నింపుకున్నప్పుడు యెంత మంచి భావములు వచ్చినప్పటికిని వాటికి యిక్కడ స్థలము లేకుండా ఉంటుంది.

**ఏమీలేని బుర్రలోన ఏమైనను నింపవచ్చు**
**ఏమేమో నిండియున్న బుర్ర నింప వీలుకాదు**
**కలిబోధలు నిండియున్న తలబుర్రలు ఖాళియగునా**
**తలబుర్రది ఖాళిగాక యిల సుకృతము నింపనగునా**

మీరు యేమేమి నింపుకున్నారో తలలో, అన్నీ ఖాళీచేసి పెట్టుకోవాలి. అప్పుడే పవిత్రమైనవి నింపుకోటానికి వీలవుతుంది. అవే మీరు నిత్యసత్యములుగా భావించుకొని బుర్రలో నింపుకుంటున్నారు. అవే భోగభాగ్యములుగా విశ్వసించి వాటిని అనేకరకములుగా ఉపయోగించుకుంటున్నారు. విద్యార్థులారా! అవి మీ భోగభాగ్యములు కాదు, అవి రోగ భాగ్యములు. ఏవి భోగములని మనము ఆశిస్తున్నామో ఆ భోగములు మానవుని రోగములలో ముంచివేస్తున్నాయి. కనుక, మీరు త్యాగములో ప్రవేశించాలి. త్యాగమే భోగముగా విశ్వసించి, అదే యోగముగా మార్చుకోవాలి. దీనిని పురస్కరించుకొనియే వేదమునందు 'నకర్మణా నప్రజయా త్యాగేనైకే అమృతత్వ మానసుః' అని చెప్పబడింది. త్యాగము చేయనటువంటి మానవునికి అమృతత్వము, ఆనందము యెట్లు లభ్యమవుతుంది? అయితే, మీరు చేయవలసిన త్యాగములు యేమిటి? కామాన్ని త్యాగము చేయాలి. భోగాన్ని త్యాగము చేయాలి. లోభాన్ని త్యాగము చేయాలి. ఇవే మీరు త్యాగము చేయవలసినవి. ఇల్లు, వాకిలి ఆస్తులు, పాస్తులు అన్ని వదలిపెట్టి పోవాలంటే వీటిని చాలా సులభముగా త్యాగము చేయవచ్చు. కాని యివికాదు, త్యాగము చేయవలసినవి.

**దుష్టభావములు త్యాగము చేసినప్పుడే నీవు పరిపూర్ణ మానవునిగా రూపొందుతావు**

మానవునికి కొన్ని కోరికలు ఉండవలసినదే! అవి యెంతవరకో అంతవరకు పెట్టుకోవాలి. మితిమీరితే మతి చెడుతుంది. ప్రమాదానికి గురి చేస్తుంది. కోరికలు సాధ్యమైనంతవరకు తగ్గించుకొని, మనము మన జీవితాన్ని సాగించటానికి పూనుకోవాలి.

sri sathyasaivachanamrutam

**భావమందు దుష్టభావము వీడుటే**
**త్యాగమగును అదియె యోగమగును**
**ఆస్తి యిల్లు వదలి అడవి కేగుట కాదు.**

అన్నారు. కనుక మనయందున్న దుష్ట భావములను మనము త్యాగము చేసుకోవాలి. అప్పుడే నీవు పరిపూర్ణ మానవుడిగా రూపొందుతావు. మనయొక్క భావములు యెంత ప్రమాణములో ఉంటుంటాయో అంత ప్రమాణములోనే మనకు భగవంతుని అనుగ్రహము చేకూరుతుంది.

**చిన్న చెఱువులో ముంచినగాని**
**ఎన్ని సముద్రముల నించినగాని**
**కడవెంతో నీరంతేరా**

మన పాత్రయెంతదో అంతనీరు మాత్రమే మనము అందుకోటానికి అర్హులమవుతాము.

**కాషాయ వస్త్రంబు వేసినగాని**
**కంఠమాల ధరియించినగాని**
**గడగడమని జపమాల తిప్పినగాని**
**కడకు యెంతనో అంతనే**
**కారడవులకే పోయినగాని**
**కఠిన తపస్సులే చేసినగాని**
**కడకు యెంతనో అంతనే**

ఈనాడు మనము మనయొక్క హృదయాన్ని విశాలము గావించుకోవాలి. heart అంటే physical heart కాదు. Physical heart పెద్దదైందంటే operation కు సిద్ధమవుతుంది. Physical heart కాదు spiritual heart. అనగా ఏమిటి? 'అందరూ భగవంతుని బిడ్డలే, అందరూ మానవునియొక్క స్వరూపములే, ఆకారములే. అందరూ మానవ జాతే!' అనే విశాలభావము పెంచుకోటమే గొప్పది. నాకేనా కొన్ని బాధలు కలుగుతే నేను యెంత కష్టపడతానో అదేబాధలు ఎదుటి వ్యక్తికి కలిగినప్పుడు తానుకూడా అంత బాధపడతాడు అనే examples తీసుకుంటూ రావాలి. మొట్టమొదట self examination చేసుకోవాలి.

sri sathyasai vachanamrutam

**పరుల కష్ట, సుఖములు తన కష్టసుఖములుగా భావించే విశాలభావమే నిజమైన ఏకాత్మభావము**

సీత ఒకానొక సందర్భములో రావణుడు వచ్చి అనేక విధములుగా తనను అంగీకరించుమని వేడుకుంటున్న సమయములో రావణునికి ఈ విధంగా బుద్ధి చెప్పింది: "ఓ రావణా! నా రామచంద్రుడు కేవలము అరణ్యవాసము చేసి, కాషాయ వస్త్రములు ధరించి పిచ్చివానివలె తిరుగుతున్నాడని నాభర్తను నిందిస్తున్నావు. నార వస్త్రములు జడలు ధరించి అడవులలో సంచరించినా, నాభర్త నా భర్తయే! అతనే నాకు పూజనీయుడు. అతని వ్రతమే నాయొక్క వ్రతము. అదియే నా అభిమతము. అదియే నాకు సమ్మతము. ఓ రావణా! నీ భార్యను యింకెవరైనా తీసుకొనిపోయినప్పుడు ఆపరిస్థితిలో నీవు యేవిధముగా ఉంటావో యోచించుకో"మని చెప్పింది. అదే విధముగనే మన బాధలు మనకు యెంతగా ఉంటుంటాయో యితరులకు వారి బాధలు అంతా ఉంటుంటాయి. ఈ విషయాన్ని మనము కొంతవరకు విచారించుకుంటూ రావాలి. నిజముగా రావణుడే 'నాభార్యను యింకెవరైనా తీసుకొని పోయిఉంటే నేను యే పరిస్థితిలో ఉండేవాడిని?', అని సత్యముగా తనలోతాను విచారించుకొని ఉంటే సీతను యింత బాధలు పెట్టేవాడు కాడు. అదేవిధముగా, మనకేమైనా కష్టములో, బాధలో, దుఃఖములో సంభవించినప్పుడు ఇతరులకుకూడను యీవిధముగానే ఉంటాయనే విశాలమైన భావములు పెంచుకోటం యిదే నిజమైన ఏకాత్మభావము. ఇది సులభముగా వచ్చేది కాదు. కొంత practice చెయ్యాలి. ఇలాంటి పవిత్రమైన విశాలభావము ఆకాశమునుండి ఉట్టిపడేది కాదు. అభ్యాసము, సాధనలు సలుపుతూ పోతే క్రమక్రమేణా అది మనకు ప్రాప్తిస్తుంది. ఎంత నిదానంగా మనము దారిలో నడుస్తూ పోయినా, యేదో కొంత దూరములోనైనా మనము చేరవలసిన గ్రామము సమీపిస్తుంది కదా! Quick గా walk చేస్తే యింకా quick గా మనకు సమీపిస్తుంది. పోనీ నీవంత త్వరితముగా పోవటానికి వీలులేనప్పుడు కొంత ఆలస్యంగా పోయినాగాని, రెండడుగులైనాగాని గమ్యానికి సమీపిస్తావు కదా! ప్రయత్నమే లేకుండా ఉంటే సమీపించడమెట్లా సాధ్యమవుతుంది? కనుక, సాధ్యమైనంతవరకు కొంచెమైనాకూడ సత్యమార్గాన్ని, యీ విశాలమైన భావాన్ని practical లో పెట్టటానికి తగిన కృషి చెయ్యాలి.

**భగవద్విశ్వాసముంటే జగత్తులో సాధించలేనిది ఏదీ లేదు**

srisathyasaivachanamrutam

# తేదీ. 07-08-1988న భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము

విద్యార్థులారా! మీకు యీ వయసులో యీ ఆధ్యాత్మికము అంతగా వంటబట్టదనే విషయము గుర్తించి సాధ్యమైనంతవరకు భగవద్విశ్వాసమును పెంచుకుంటూ రండి. భగవద్విశ్వాసమే ఉంటుంటే మనము సాధించలేనిది యీ జగత్తులో యేదీ ఉండదు. అన్నింటిని సాధించవచ్చు. ఇది మీకు తెలియక పోవచ్చు, కాని ప్రయత్నించండి. తప్పక ఆ అనుభవము అనుభూతిలో తేలుతుంది. అన్నింటిని నమ్ముతున్నారు. బజారులో పోయేవారు ఎవరు చెప్పినా నమ్ముతున్నారు. ఏ astrologer చెప్పినా నమ్ముతున్నారు. క్యాలండరులో 'యీ పొద్దు ఏకాదశి' అని చెబితే దానిని నమ్మి ఏకాదశి వ్రతము చేస్తున్నారు. ఒక సిద్ధాంతి వచ్చి యీ పొద్దు అమావాస్య అంటే తర్పణాలు విడుస్తున్నారు. ఇలా అన్నింటిని నమ్ముతున్నారు. కాని, దైవవాక్కు మాత్రం నమ్మటం లేదు. అదే దురదృష్టము. పవిత్రమైన వేదము, భగవత్ శ్వాసయైన వేదము, ఋషులంతా సత్యమార్గములో ఆర్జించిన వేదము 'తత్త్వమసి' 'అదే నీవు నాయనా!' అని బోధిస్తుంటే 'అది నేనెట్లా అవుతాను?' అని ఉల్లఘించి పోతున్నారు. ఈ అన్నింటిని నమ్ముతున్నాడు దేనికోసం? స్వార్థంకోసం నమ్ముతున్నాడు. దైవవాక్కు నిస్వార్థమైనది. ఒక astrologer వచ్చి చేయి పట్టుకొని యీ గీతవలన నీకు గొప్ప విద్యలభిస్తుంది అని చెప్పినప్పుడు అనుకున్నదానికంటె ఒక రూపాయి ఎక్కువ తీసి అతని చేతిలో పెడతారు. ఇంకొకడు వచ్చి చాలా కీర్తి అనుభవిస్తావు అని ఒక వ్రాత ఉంటున్నాది నీ చేతిలో అని చెపితే యింకో రూపాయి యిచ్చేస్తాడు. నీకు అన్నీ సమృద్ధిగా ఉంటున్నాయని ఎవరైనా చెపితే వానికి పట్టలేనంత ఆనందము కలుగుతుంది. కానీ అదే సమయంలో మరి యింకొక గీతను చూచి 'అయ్యో! నీ ఆయుఃప్రమాణము తక్కువగా ఉందంటే' కృంగిపోతారు. అయిపోయింది, లైఫ్ దగ్గరకు వచ్చేటప్పటికి కృంగిపోతారు. ఈ లైఫ్ యేనాటికైనా కృంగక తప్పుతుందా? దినదినమునకు కృంగిపోతూనే ఉంటుంది. ఒక దినమునందు సూర్యోదయము, సూర్యాస్తమయము, అంతే! యిరవైనాలుగు గంటలు మన లైఫ్‌లో మైనస్ అయిపోయింది. సత్యమైన మాట చెబుతే వీనికి అసంతృప్తి కలుగుతుంది. అనిత్యము, అసత్యము, అశాశ్వతము అయిన మాటలు చెప్పినప్పుడు పొంగిపోతారు. సత్యము అంతా జన విరోధముగా కనుపిస్తుంది. అసత్యం జనరంజకమ్. మద్యమునకు అలవాటుపడిన వ్యక్తి వూరికి చివర ఎక్కడో అంగడి పెట్టుకొని ఉన్నాగానీ అక్కడకు నడచిపోయి చాలా ఆనందముగా డబ్బిచ్చి తాను తెచ్చుకుంటాడు. కాని, యింటింటికి వచ్చి

sri sathyasai vachanamrutam

'అమ్మా! పాలు కావలెనా, పెరుగు కావలెనా' అంటే 'మాకు వద్దుపో వద్దుపో' అంటారుట! ఇంటికి వచ్చిన పవిత్రమైన క్షీరమును వద్దంటారు కానీ అపవిత్రమైన, దుష్టమైన, మనసును చంచలము గావించే మద్యపానము కావాలని పరుగెత్తి వెళ్ళి తెచ్చుకుంటారు. ఈనాటి కలిప్రభావము మానవుని యీరకమైన dance ఆడిస్తున్నాది. యిది ఈనాటినుండే గుర్తించటానికి ప్రయత్నించండి. ఏది సత్యము, ఏది అసత్యము, ఏది నిత్యము, ఏది అనిత్యము, ఏది క్షేత్రము, ఎవరు క్షేత్రజ్ఞుడు తెలుసుకోండి! దేహము కేవలము క్షేత్రము. కానీ, యిందులో ఆత్మయనే క్షేత్రజుడు లేకపోతే దేహము కేవలము ఒక జడము.

### "Understanding is Communication"

విద్యార్థులారా! ముఖ్యముగా అన్నింటికిని ఆధారమైన ఆత్మతత్త్వమునందు మీరు విశ్వాసము పెంచుకోవాలి. ఆత్మ విశ్వాసముతో మీరు అన్నింటిని సాధించగలరు. ఆత్మ విశ్వాసము బలహీనమైనవాడు యేమీ సాధించలేడు. ఈనాడు మనము చదివే చదువులకు, జీవితములో అనుభవించే అనుభూతులకు యేమాత్రము సంబంధము లేదు. కాని, చదవక తప్పదు. చాలామంది పిల్లలు M.B.A. చదువుతున్నారు. ఈ MBA లోపల Management అనేది పెట్టుకున్నారు. కానీ, యీ management లో 'O' grade వచ్చినప్పటికి యే యిరవైయేండ్లు experience ఉన్న workerని చూసినా వానిదగ్గర వీని MBA యేమాత్రము పనికిరాదు. వాడు చిన్న worker. వాడేదో Ist standard లేక 2nd standard చదివి ఉంటాడు, పాపం. వాడు experience పైన ఆధారపడి ఉంటాడు. మనమంతా book knowledge పైన ఆధారపడి ఉంటున్నామే గాని మనకు experience లేదు. ఇంత చదివినవాడైనా కూడను ఆ worker దగ్గరకు పోయి వీడు వానికి దాసోహం కావాలి. కనుక, మనము చదువుతోపాటు అనుభవమునుకూడా సంపాదించుకోవాలి. అదే మనము understand చేసుకోవలసిన విషయము. మనం MBA లోపల communication అని పెట్టాము. ఏమిటి ఈ communication అంటే? Workers తో communication, మార్కెట్లుతో కమ్యూనికేషనా, Raw materials తో కమ్యూనికేషనా లేక మేనేజర్లుతో కమ్యూనికేషనా, డైరెక్టర్లుతో కమ్యూనికేషనా, యింకే విధమైన కమ్యూనికేషన్ యిది? వీటన్నింటితో బాహ్యసంబంధమైన

sri sathyasai vachanamrutam

కమ్యూనికేషన్ ఉండవలసినదే! యీనాడు ఫోన్ కమ్యూనికేషనే చాలా ఎక్కువగా ఉంది. ఈ ఫోన్ తీసుకుని ఎవరితో మాట్లాడుతున్నారో, ఏమి కమ్యూనికేషన్ చేస్తున్నారో తెలీదు. టైపిస్టుతో మాట్లాడవచ్చు లేక అడ్వర్‌టైజ్‌మెంటు వాళ్లతో మాట్లాడవచ్చు. కాని అదికాదు, నిజమైన బిజినెస్‌లో ఉండవలసిన కమ్యూనికేషన్. Understanding is communication. అందరిని అర్థము చేసుకోవాలి. ఇది ఎట్లా ఉండాలంటే మన శరీరమునకు, మన యొక్క స్పర్శకు, మన sensesకు మధ్య యేవిధమైన కమ్యూనికేషన్ ఉందో ఆవిధముగా ఉండాలి. నేను మీతో నోటితో మాట్లాడుతున్నాను, కళ్లతో చూస్తున్నాను, మనస్సుతో అనుభవిస్తున్నాను. కానీ, నాకాలిపై ఏమైనా చీమపడితే దానిని కొట్టేస్తున్నాను. అదీ కమ్యూనికేషన్. ఎక్కడో చీమ పాకుతున్నా మీతో మాట్లాడుతున్న నాయొక్క mind చీమపైన పోయింది. కనుక, మీరు యేపని చేస్తున్నప్పటికిని అక్కడ బిజినెస్సుకు సంబంధించిన దానిపై దృష్టి ఉండాలి. కనుక all round communication గా ఉండాలి. అదే నిజమైన understanding. ఒకదానిని మరచిపోయి, ఒక దానిని లక్ష్యములో పెట్టుకోటం యిది కమ్యూనికేషన్‌కు యేమాత్రము అర్థము కాదు. ఇది ఎలా అంటే, ఆవరణ, విక్షేపము రెండూ ఒకేసారి జరుగుతుంటాయి. ఇప్పుడు దారిలో ఒక త్రాడుఉంది. కానీ చీకటిగా ఉన్నప్పుడు యిది పామేమోనని భ్రమ వచ్చింది. కానీ లైట్ వేసేటప్పటికి అది త్రాడు, పాముకాదని తెలిసింది. పాము పోయినట్లు త్రాడు వచ్చినట్లుగా నీవు భావిస్తున్నావు. పాము ఎప్పుడు పోయింది, త్రాడు ఎప్పుడు వచ్చింది? రెండూ ఒకేసారి. ఇంతకు ముందు నీవు చూచినప్పుడు పాము రాలేదు, త్రాడు పోలేదు. లైట్ వేసినప్పుడు త్రాడు రాలేదు, పాము పోలేదు. అప్పుడు వున్నదీ త్రాడే, యిప్పుడు ఉన్నదీ త్రాడే! వచ్చినది, పోయినది నీ భ్రమయే. ఇది సరైన కమ్యూనికేషన్ కాదు. వస్తువుయొక్క యథార్థమును గుర్తించటమే సరైన కమ్యూనికేషన్. ఆ సత్యాన్వేషణే సరైన కమ్యూనికేషన్. ఈ సత్యాన్వేషణ అనే దానిని మనము చూచినప్పుడు, ఎక్కడికి పోయినా అంతాకూడను సత్యమే అయిపోతుంది. అయితే ఈ communications లోపల యింకా చాలా ఉంటున్నాయి. ఐతే కొంతవరకు అవసరమైనవి మాత్రమే మనము తీసుకోవాలి.

ఈనాడు బిజినెస్ మేనేజ్‌మెంట్‌లోపల ప్రవేశించి దేశములో పవిత్రమైన మేనేజ్‌మెంటు అభివృద్ధిపరచి, యీ యొక్క వ్యాపార రంగములో వస్తు అభివృద్ధి, నిర్మాణము అధికముగావించి

sri sathyasai vachanamrutam

ప్రపంచము అందరికీ సమానముగా పంచాలనే ఉత్తమ భావమును మనము పెంచాలి. వస్తు ఉత్పత్తి మొట్టమొదటిది. ఈ ఉత్పత్తి చేసిన వస్తువును రక్షించటం మరియొక ప్రధానమైన అంశము. ఈ రక్షించిన పదార్థమును సర్వులకు సరఫరా చేయటం మరొక ప్రధాన లక్ష్యము. కనుక, మనమీనాడు ఏవిధముగా పోవాలంటే మొట్టమొదట production, ఆ production ఎలా ఉండాలంటే మన హృదయమునుండి projection లా రావాలి. ఈ production workers తో communication ఉండాలి. ఈ workers తయారు చేసిన పదార్థాన్ని collection చేయాలి. ఈ collection చేసుకున్న తరువాత ఏవిధముగా కాపాడుకోవాలో చూడాలి. ఈవిధముగా అన్నీ సరిగా ఉండినప్పుడే అన్నీ మనకు సరైనవిగా చేకూరుతాయి. వీటన్నింటికి మొట్టమొదట direction చాలా అవసరము. Proper direction of workforce చేసినప్పుడే వారు production సరిగా చేయగలరు. ఆ production నుండి collection గావించి, యీ collection నుండి మనము correction తీసుకోవాలి. ఇది బిజినెస్‌యొక్క alround communication.

ఈనాడు workers తో మేనేజ్‌మెంటుకు సరియైన సంబంధము ఉండటం లేదు. production ఎలా అవుతున్నదని యోచన చేసుకోటం లేదు. చాలామందికి తెలుసు. ఈ Business mangement ను డ్రక్కర్ అభివృద్ధి పరిచాడు. దానినంతా సృష్టించిన డ్రక్కరే యీనాడు తన మనసంతా మార్చుకున్నాడు. అతనికి 87 సం॥లు. ఉన్నాడింకా, పాపం. కాని, 'యిప్పుడు నేను చేసింది తప్పు, నేను positive ని మాత్రమే చక్కగా గుర్తు పెట్టుకున్నాను కానీ నెగిటివ్ కూడా కావాలి, నెగిటివ్, పాజిటివ్ రెండు ఉన్నప్పుడే దీనికి సరైన అర్థము వస్తుంది. కాబట్టి యీనాడు production అనేది చాలా అవసరం' అని తాను తెలుసుకున్నాడు. ఇప్పుడు మరొక నూతనమైన వ్యక్తి యీ management లోపల సరియైనవి గమనించి ప్రపంచానికి చాటటానికి పూనుకుంటున్నాడు, విలియం అని. ఇప్పుడంతా రష్యాలోగాని, అమెరికాలోగాని జపాన్‌లోగాని ప్రపంచంలో ఎక్కడ చూచినా బిజినెస్ మేనేజిమెంటులో అంతా మార్పులొస్తున్నాయి.

విద్యార్థులారా! పూర్వమంతా కేవలము అమెరికా బిజినెస్ అమెరికాకు మాత్రమే

srisathyasaivachanamrutam

సంబంధించి ఉండేది. ఇండియా బిజినెస్ ఇండియాకు మాత్రమే ఉండేది. కానీ, అమెరికా బిజినెస్‌ను adjust చేసుకుని యిండియన్సు అంతా develop చేసుకునేవారు. ఆనాడు ఎక్కడికక్కడ ఒక nationకు మాత్రమే సంబంధించిన business management గా ఉండేది. కానీ, ఈనాడు యేదేశములో business చేసినా International Business. అంతాకూడా మారిపోయింది. ఈనాడు జపాన్‌నుండి మనము మెషీన్సు తెచ్చుకుంటున్నాము. అమెరికా, రష్యాలనుండి తెచ్చుకుంటున్నాము. దీని parts కొరకు వారి దగ్గరకు పోవలసినదే, రావలసినదే! ఈ connection అంతా ఉంటుంది. ఈనాడు business అంతా international business గా రూపొందుతున్నది. బయట దానిని మనం తీసుకుంటూ ఉంటే imitation అనే competetion లో మనముకూడా దిగవలసివస్తుంది. మనలో యిమిటేషన్ ఉండకూడదు. కాంపిటీషన్ అసలే ఉండకూడదు. ఈ కాంపిటీషన్‌వలన మనయొక్క బిజినెస్ లాస్ అవుతుంది.

ఇప్పుడు కొత్తగా కొన్ని తయారౌతున్నాయని MBA పిల్లలకు చెప్పుతున్నాను. ఒకవారం దినములలోపల చైనాలోపల అంతా బిజినెస్ మార్పుచెందిపోయింది. ఏ కంపెనీలో నష్టం కలుగుతుందో ఆ కంపెనీలన్నీ తక్షణమే మూసివేయాలని గవర్నమెంటు ఆర్డర్సు వేశారు. యుగస్లేవియాలో ఏం చేస్తున్నారు యిప్పుడు? అది కూడా ఒక వారం క్రిందనే వచ్చింది. కంపెనీలు నష్టములో ఉంటే, వర్కర్సు పనిచేయకుంటే ఆ కంపెనీలను workers కి యిచ్చేసి మీరే దీనిని develop చేయండి, మాకు bank లో ఉన్న అప్పు మీరు చెల్లించండి అన్నారు. అప్పుడు workers ఎంతో interest గా చేస్తూ ఉన్నారు. తమపైన ఒక మేనేజర్ ఉన్నాడంటే యీ వర్కర్సు సరిగా పనిచేయరు. వర్కర్సుకే యీపని యిచ్చేస్తే వారు దండిగా లాభము రావాలని శ్రద్ధగా అభివృద్ధిపరచుకుంటారు. అయితే యీ రెండింటికి విరుద్ధముగా జరుగుతోంది. మన భారతదేశములో నష్టము వస్తున్నదని కంపెనీలను మూస్తే, మూయకూడదు. నష్టం వచ్చినా నడపవలసినదే! మూసేసినా వీరికి జీతములు యివ్వవలసినదే! ఎక్కడనుండి తెచ్చి యిస్తాడు, జీతములు యీయన? మరల బ్యాంకులో అప్పు తీసుకోవలసినదే. కానీ, బ్యాంకు వారు అప్పు ఈయటం లేదు. ఇది యెంత విచిత్రమైన పరిస్థితి? యిలాంటి పరిస్థితిలో మేనేజర్సు యేమి చేయగలరు పాపం? ఏ విధముగా దీనిని direct చేయగలరు? యీ విధంగా బిజినెస్ అంతా తికమకలుగా ఉంటోంది. ప్రపంచమంతా యీనాడు వ్యాపారముతో నిండినది. కనుక,



srisathyasaivachanamrutam

యీ బిజినెస్ సక్రమమైనదిగా ఉన్నప్పుడు అందరికి సరియైన పద్ధతిలో ఉండేలా రూపొందింపచేసినప్పుడే జగత్తంతా నిత్యకళ్యాణముగా ఉంటుంది. కనుక, యీ బిజినెస్‌లో నేర్చుకోవలసినవి చాలా ఉన్నాయి.

ఇక్కడ మీరు నిజంగా గుర్తించవలసినది చాణక్యుని అర్థశాస్త్రము. మనువు, అగస్త్యునియొక్క ధర్మశాస్త్రాన్నికూడా గుర్తించాలి. నేను అనేకమంది పిల్లలను చాణక్యుడంటే ఎవరని అడిగాను. అది అతనిపేరు అన్నారు. కానీ, చాణక్యుడనేది అతని పేరు కాదు. 'చాణక్య' అనే గ్రామములో పుట్టినవాడు కనుక, ఆ గ్రామము పేరు అతనికి పెట్టారు. ఇతనికే 'కౌటిల్య' అని మరొకపేరు. అనగా కుశలమైన బుద్ధి కలవాడు కనుక కౌటిల్యుడన్నారు. ఇతనికి పెట్టినటువంటి పేరు విష్ణు గుప్తుడు. ఈ విష్ణుగుప్తుని తత్త్వాన్ని యీనాడు మరచిపోయి, అతని అర్థశాస్త్రాన్ని అనర్థ శాస్త్రముగా మార్చుకుంటూ వస్తున్నారు. ఆనాటి పరిస్థితుల ప్రభావాన్ని గురించి ఆనాటి అర్థశాస్త్రం చక్కగా ఉండేది. కాని, యీనాటికి ఆనాటికి, చాలా వ్యత్యాసము ఉంది. ఇందులో రెండు రకములైన అర్థశాస్త్రములున్నాయి. తాత్కాలికమైన అర్థశాస్త్రం ఒకటి. శాశ్వతమైన అర్థశాస్త్రం మరొకటి. ఈ శాశ్వత అర్థశాస్త్రము అంతా హృదయమునుండి, మనస్సునుండీ ఆవిర్భవించేది. ఇంక బ్యాంకులను, workers ను share holders ను వీళ్లందరిని బాహ్యముగా గుర్తించుకొని వాటికి తగిన రీతిగా share holders కు యెంత యివ్వాలి యీ బ్యాంకుకు యెంత వడ్డీ ఇవ్వాలి మొదలైన విషయాలంతా బాహ్యశాస్త్రము. ఇందులో మార్పులు కలుగుతూ ఉంటాయి. ఈ విధంగా ఒకటి మార్పు చెందేది, రెండవది మార్పు చెందనిదది. మనము మార్పు చెందని దానిని ఆధారము చేసుకోవాలి. మార్పు చెందని దానిని ఆధారము తీసుకొని మార్పుచెందే మార్గములో మనము ప్రవేశించాలి. ప్రాచీన లక్ష్యము, ఆధునిక కర్మలు యీ రెండింటిని సమన్వయము చేసుకోవాలి.

విద్యార్థులారా! మీకు ఎక్కువ శ్రమ యిస్తున్నాను. మాటాడను, మాటాడను అని చెప్పి గంటన్నర తీసుకున్నాను. ఇవి కేవలం MBA పిల్లలకు మాత్రమే అవసరమైన విషయములు కనుక, మిగతా పిల్లలకంతా కొంత headache గా ఉంటుంది. ఇంకచాలు, భజన చేయండి.

**(తేదీ. 07-08-1988న భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

srisathyasaivachanamrutam